క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న దేవగిరి మహారాజ్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు వెంకటరమణ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోచమ్మ,బాలమ్మ, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. ముందు రోజు విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. శనివారం దేవతలను పూజించి చండీయాగం, విగ్రహాల జలాదివాసం నిర్వహించారు. ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్, డాక్టర్ బసవలింగ అవధూత గిరి మహారాజ్‌లు విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు.

తూముకు పగుళ్లు... వృథాగా నీరు



కుంట తాముకు పగుళ్లు పడిన దృశ్యం

పుల్‌కల్(అందోల్): తూముకు పగుళ్లు ఏర్పడి కుంటలోని సాగే నీరంతా వృథాగా పోతోంది. మండల కేంద్రం పుల్‌కల్‌లోని పాతకుంట తూముకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ కుంటకు మిషన్ కాకతీయలో నాణ్యత లేని పనులు చేయడం వల్ల తూముకు పగుళ్లు ఏర్పడ్డాయని ఆయకట్టు రైతులు ఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుంటలోకి నీళ్లు చేరాయి. పగుళ్ల ఏర్పడి కుంటలోని నీరంత వృథాగా పోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి తూముకు మరమ్మతు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

జడ్పీహెచ్‌సీలో బాల సభ



గీతాలాపన చేస్తున్న విద్యార్థినులు

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో శనివారం బాల సభ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఆలపించిన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సామూహికంగా విద్యార్థులు కలసి పాటలు పాడటంతో పాటు నృత్యాలు కూడా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపన్యాసాలు కూడా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం సచ్చిదానందరెడ్డి పాల్గొన్నారు.


కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ



కార్మికులకు రక్షణకిట్లను అందజేస్తున్న కమిషనర్

నారాయణఖేడ్: పురపాలక కార్యాలయంలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం పారిశుద్ధ్య కార్మికులకు కమిషనర్ జగ్జీవన్ పీపీఈ రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఆరోగ్యం దృష్ట్యా పారిశుద్ధ్య పనులు చేస్తున్న సమయంలో విధిగా రక్షణకిట్లను ధరించాలని సూచించారు. పలుకాలనీలో వ్యాధులు వ్యాప్తించకుండా దోమల నివారణ మందును పిచికారి చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఏఎస్ నగర్ కాలనీలో తడి, పొడి చెత్తపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కమిషనర్‌తో పాటు పురపాలిక మేనేజరు వెంకటశివయ్య, పారిశుద్ధ్య అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

శివలింగం ఏర్పాటుకు భిక్షాటన



నిధులు సేకరిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలోని తాబేలు గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న జీవనజ్యోతిర్లింగ ఆలయంలో ప్రతిష్ఠించే శివలింగం ఏర్పాటుకు శనివారం నిధులు సేకరణలో భాగంగా భిక్షాటన నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠించే శివలింగానికి కావలసిన నిధుల్లో గ్రామంలోని ప్రతీ ఒక్కరూ భాగస్వాములు చేయాలనే ఉద్దేశంతో భిక్షాటన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్తుల నుంచి రూ. 1.39 లక్షలు సేకరించినట్లు తెలిపారు. త్వరలో పనులు పూర్తిచేసి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిఘా నేత్రంలో జహీరాబాద్

- కేసుల ఛేదనకు సీసీ కెమెరాల తోడ్పాటు
- జహీరాబాద్‌లో 200 కెమెరాల ఏర్పాటు

జహీరాబాద్ టౌన్: నేరాల నియంత్రణ, ప్రజల భద్రత దృష్ట్యా రోజు రోజుకూ సీసీ కెమెరాల ప్రాధాన్యం పెరుగుతుంది. వీటి అవసరాల గుర్తించిన పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు వాటి ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. నేరాల అదుపు కోసం పోలీసులు సీసీ కెమెరాలను బిగిస్తున్నారు. జహీరాబాద్ పోలీసులు ఇటీవల పెద్ద సంఖ్యలో పట్టణంలో నిఘా నేత్రాలను బిగించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. నేర నియంత్రణ, కేసు ఛేదనలో వీటికి అంతటి ప్రాధాన్యత ఉంది. జహీరాబాద్ ప్రాంతం రాష్ట్ర సరిహద్దులో ఉన్నందున నిషేధిత గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా, అక్రమ మద్యం సరఫరా జరగకుండా నియంత్రించేందుకు అవకాశం ఉంది. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు ఉపయోగపడుతాయి, మహిళల మెడలోని బంగారు ఆభరణాలు, గొలుసులు లాగేసుకొని పారిపోవడం, రాత్రి పగలు తేడా లేకుండా దొంగలు ఇళ్లు, వ్యాపార దుకాణాల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడటం వంటి ఘటనలకు చెక్ పెట్టేందుకు సీసీ కెమెరాల వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ మేరకు జహీరాబాద్ పోలీసులు ఇటీవల దాతల సహకారంతో సుమారు వంద సీసీ కెమెరాలను బిగించి నిఘా వ్యవస్థను పటిష్టపరిచారు. ఆధునిక సాంకేతికతను కలిగిన సీసీ కెమెరాలను పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్, పట్టణంలోని ఎంట్రీ, ఎగ్జిట్‌లలో వీటిని బిగించారు.



జహీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ పరితోష్ (ఫైల్)



పస్తాపూర్ దారిలో సీసీ కెమెరా

నేరాల నియంత్రణకు దోహదం

జహీరాబాద్ పట్టణ జనాభా సుమారు లక్ష వరకు ఉంటుంది. సరిహద్దులో కర్ణాటక రాష్ట్రం ఉండగా.. పట్టణం జాతీయ రహదారిపై ఉంది. చోరీలు, అక్రమ రవాణా తదితర నేరాలను నియంత్రించేందుకు పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గతంలో సుమారు వంద వరకు కెమెరాలను బిగించినా.. పలు కారణాల వల్ల సరిగ్గా పనిచేయడం లేదు. ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు అప్పటి డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దాతల సహకారంతో కొత్తగా 100 ఆధునిక సాంకేతికతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటుకు కృషి చేశారు. ప్రస్తుతం సుమారు 200 వరకు సీసీ కెమెరాలు ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రైల్వే, బస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పోలీసు స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం. వీటి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి. జన సంచారం ఉండే ప్రదేశాల్లో, దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

–వినయ్‌కుమార్, ఎస్‌ఐ

తల్లిపాలతోనే శిశువుకు పోషకాలు



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న మధులత

జిన్నారం (పటాన్‌చెరు): తల్లిపాలతోనే పిల్లలకు పోషకాలు అందుతాయని, వారి ఎదుగుదల సామర్థ్యం ఉంటుందని జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారిణి మధులత పేర్కొన్నారు. శనివారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం, వీరన్నగూడెం అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ...పుట్టిన పసిపిల్లలకు తల్లిపాలతోనే పోషకాలు అందుతాయని, రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుతుందని చెప్పారు. పిల్లలకు తల్లిపాలు మాత్రమే అందజేయాలని సూచించారు. తద్వారా కలిగే ప్రయోజనాలను, ప్రాముఖ్యతపై బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో శ్రీనివాస్, ఏఎన్ఎం వసంత పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం సాధించాలి



విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేస్తున్న కార్పొరేటర్

కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదిలో 550కు పైగా మార్కులు తెచ్చుకున్న వారికి రూ.5 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో తాము ఏది సాధించాలని అనుకుంటున్నారో అది లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు పట్టణ అధ్యక్షులు నాగరాజు యాదవ్, బండ్లగూడ డివిజన్ అధ్యక్షులు భరత్ సత్యనారాయణ , పాఠశాల హెచ్ఎం స్పందన తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు.. వాహనదారులకు తిప్పలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పగలు, రాత్రి సమయంలో రోడ్లపైనే సేదతీరుతూ కొన్ని సందర్భాల్లో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నాయి. రోడ్డుపై వెళుతున్న వాహనాలకు అడ్డుగా రావడంతో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. అధికారులెవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. జహీరాబాద్ పట్టణంలో నిత్యం వేలాది వాహనాలు తిరిగే మెయిన్ రోడ్డుపై పశువులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దీంతో వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో పశువులు అడ్డదిడ్డంగా సంచరించడంతో ప్రజలు ఇబ్బందులు పడతున్నారు. రోడ్డుపైనే సేదతీరడం వల్ల ప్రయాణికులు భయపడుతున్నారు. రద్దీ ప్రాంతాల్లో పశువులు సంచరించడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి పశువులను రోడ్డుపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో సేదతీరుతున్న పశువులు

ఎకరాకు యూరియా బస్తా

మండల వ్యవసాయాధికారి అంజలి

మునిపల్లి(అందోల్): పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు ఆధారంగా ఎకరాకు బస్తా చొప్పునా యూరియా పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అంజలి తెలిపారు. శనివారం మండలంలోని పెద్ద చల్మెడ, తాటిపల్లి గ్రామాల్లో యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పెద్దచల్మెడ వ్యవసాయ సహకార పరపతి సంఘంలో దగ్గర ఉండి ఎకరాకు బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు. ఇటీవల వర్షాలు ఎక్కువగా పడడంతో రైతులు పత్తి పంటలతో పాటు పెసర, మినుము, కంది పంటలకు ఎరువులను పోసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. యూరియా కొరత ఉండడంతో రైతులు అధిక ధరకు దొరికిన చోట తెస్తున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసే యూరియా సమయానికి రాకపోవడంతో అధిక ధరకు యూరియా కొనాల్సి వస్తుందని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు పంటలకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

గంజాయి, గోవా మద్యం స్వాధీనం

మునిపల్లి(అందోల్): 1.129 కిలోల గంజాయి, 5,250 లీటర్ల వివిధ రకాల బ్రాండ్లకు సంబంధించి గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ శంకర్ తెలిపారు. శనివారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. కుక్కట్‌పల్లికి చెందిన పటేల్ సాయికుమార్, కాశిరాహుల్, గూండ్ల మహేశ్‌గౌడ్ అక్రమంగా 1.129 కిలోల ఎండు గంజాయిని స్కూటీపై బీదర్ నుంచి తెస్తున్నారు. స్కూటీ, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. గోవా నుంచి సుంకం చెల్లించని 5.25 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు హనుమంతు, అనుదీప్, దిలీప్, సిబ్బంది అంజిరెడ్డి, అరుణజ్యోతి పాల్గొన్నారు.



గోవా మద్యంను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నిబంధనల ప్రకారం ఆస్పత్రులు కొనసాగించాలి



సన్‌రైజ్ హాస్పిటల్ వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారి నాగనిర్మల

జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి నాగ నిర్మల

సంగారెడ్డి: ప్రతి ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి నాగ నిర్మల సూచించారు. శనివారం సంగారెడ్డిలోని గోకుల్ వెంకటేశ్వర సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి,, వినోద్ ఆస్పత్రి, సన్ రైజ్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. అనుమతులు డాక్టర్ల అర్హతలు, స్టాఫ్ లభ్యత, శానిటేషన్, అత్యవసర సేవల నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే బైపాస్‌లోని బృందావన్ కాలనీలో అనుమతి లేకుండా నడుస్తున్న సాహితీ క్లినిక్, డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పదివేల జరిమాన విధించి సీజ్ చేశారు. అలాగే వినోద్ ఆసుపత్రిలో డాక్టర్ల వివరాలు డిస్‌ప్లే చేయని కారణంగా నోటీసులు జారీ చేశారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులలో తనిఖీ చేయడానికి ఏడు టీంలు ఏర్పాటు చేశామని నాగనిర్మల తెలిపారు.

రికార్డులను సమర్పించండి

ఎంపీడీవో షరీఫ్

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏడాది కాలంలో చేసిన పనులకు సంబంధించిన పూర్తి రికార్డులను ఆడిట్ సిబ్బందికి సమర్పించాలని ఎంపీడీవో ఎంఎం షరీఫ్ ఆదేశించారు. రాయికోడ్‌లోని ఐకేపి భవనంలో శనివారం సామాజిక తనిఖీకి సంబంధించిన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనిఖీ బృందం పనుల పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఆర్‌పి రాఘవులు, ఏపీఓ, రమేష్ కుమార్, ఈసీ విష్ణు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెట్లు పాల్గొన్నారు.

వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి, ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన వీరేష్ (32) బతుకుదెరువు కోసం వచ్చి ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం తన మరదలు సోనీని తీసుకొని ఇస్నాపూర్ నుంచి మల్లికార్జున్‌నగర్‌కు బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో పటాన్‌చెరు వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలై వీరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సోనీకి స్వల్ప గాయాలైయ్యాయి.

నేడు సీపీఐ జిల్లా మహాసభ

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు సీపీఐ సంగారెడ్డి జిల్లా మహాసభను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకులు చిరంజీవి, అశోక్ తెలిపారు. ద్విచక్ర వాహనాలతో ప్రదర్శన అనంతరం మహాసభ ప్రారంభమవుతుందన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, ఎమ్మెల్సీ సత్యం హాజరు కానున్నారని వివరించారు.

4న శివ పంచాక్షరీ జపయజ్ఞం

సంగారెడ్డి టౌన్: శ్రావణమాసం సందర్భంగా సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని కేతకి సంగమేశ్వర ఆలయంలో ఈ నెల 4వ తేదీ సోమవారం రోజున అఖండ శివ పంచాక్షరీ జపయజ్ఞం నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజ్ శర్మ, శివకుమార్ తెలిపారు. సూర్యోదయం ఆరు గంటల 30 నిమిషాల నుండి సూర్యాస్తమయం ఆరు గంటల 30 నిమిషాల వరకు నిర్విరామంగా మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నకిలీ యాప్స్‌పై అప్రమత్తంగా ఉండండి

- వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచన
- ప్రధాని ప్రత్యక్ష ప్రసారం వీక్షించిన రైతులు

జహీరాబాద్: జహీరాబాద్ సమీపంలోని డీడీఎస్-కేవీకే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు వీక్షించారు. శనివారం పీఎం కిసాన్ 20వ విడత నిధుల విడుదలపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సాయిప్రియాంక, వరప్రదాస్, ఏఓ లావణ్యలు మాట్లాడుతూ ..నకిలీ పీఎం కిసాన్ యాప్స్‌పై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉమంగ్ వంటి యాప్స్‌ను మాత్రమే ఉపయోగించాలని కోరారు. రైతులు తక్షణమే జన్‌ధన్ ఖాతాలకు ఈకేవైసీ పూర్తి చేయాలని, అప్పుడు మాత్రమే పీఎం కిసాన్ నిధులు అంతరాయం లేకుండా అందుతాయన్నారు. పీఎం కిసాన్ నిధులు తమ ఖాతాల్లో పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, స్నేహలత, రమేష్, హేమలత, కైలాష్, భూసార నిపుణుడు స్వామి, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం

పెద్దశంకరంపేట(మెదక్):రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మండల బీజేపీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ స్పష్టం చేశారు. స్థానిక రైతువేదికలో ప్రధాని మోదీ చేతుల మీదుగా శనివారం రూ.20.5 వేల కోట్లు కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీక్షించారు. పీఎం కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా 9.7 కోట్ల మంది రైతుల ఖాతాలలో పెట్టుబడి సహాయాన్ని అందించారన్నారు. రైతులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వినీత్ రైతులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే పథకాలు బంద్



పత్తి పంటలో గంజాయి మొక్కల సోదాలు చేస్తున్న ఎస్‌ఐ దుర్గారెడ్డి

ఎస్ఐ దుర్గారెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సిద్ద దుర్గారెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని దెగుల్‌వాడి గ్రామ శివారులో పత్తి చేనులో సోదాలు చేశారు. రైతులు పత్తి, కంది, చెరుకు తదితర పంట చేల్లో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నట్లు అనుమానంతో పోలీసు సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. గంజాయి సాగు చేసిన వారికి ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలైన రేషన్, రైతు భరోసా, రైతుబీమా, ఉచిత విద్యుతతదితర పథకాలు అన్నీ కట్ చేయడంతో పాటు కేసు నమోదు చేసి జైలుకు పంపడం ఖాయమన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇందిరమ్మ ప్రొసీడింగ్ కాపీ అందజేత

సదాశివపేట(సంగారెడ్డి): దశలవారీగా ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 17వ వార్డులో లబ్ధిదారురాలు రాధాబాయికి ఇందిరమ్మ గృహనిర్మాణ మంజూరు ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ప్రసన్నశంకర్‌గౌడ్, రవి, కాంగ్రెస్ నాయకులు హాజీ, రఘు, వసీం, సెజ్జీ, తుకారం, మదు, యాదగిరి, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

◆ 4న శివ పంచాక్షరీ జపయజ్ఞం

సంగారెడ్డి టౌన్: శ్రావణమాసం సందర్భంగా సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని కేతకి సంగమేశ్వర ఆలయంలో ఈ నెల 4వ తేదీ సోమవారం రోజున అఖండ శివ పంచాక్షరీ జపయజ్ఞం నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజ్ శర్మ, శివకుమార్ తెలిపారు. సూర్యోదయం ఆరు గంటల 30 నిమిషాల నుండి సూర్యాస్తమయం ఆరు గంటల 30 నిమిషాల వరకు నిర్విరామంగా మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

◆ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్‌లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పూర్వవిద్యార్థులు రూ. 2లక్షల విలువైన సీసీ కెమెరాలు, ఎలక్ట్రిక్ బెల్‌ను ఏర్పాటు చేయించారు. విద్యాబుద్ధులు నేర్పించిన పూర్వ ఆచార్యులకు, మాతాజీలకు సన్మానం చేశారు. ఇందుకుగాను పూర్వ విద్యార్థులను పాఠశాల ప్రబంధకారిణి బృందం అభినందించింది. పూర్వ ఆచార్యులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి

జహీరాబాద్ టౌన్: ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరుతూ నలంద విద్యాలయం విద్యార్థులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

◆ దొంగతనానికి విఫలయత్నం

నర్సాపూర్ రూరల్: ఇంటి ముందు పార్కు చేసిన కారులో నుంచి మ్యూజిక్ సిస్టం, ఏసీ పాయింట్, ఇతర వస్తువులను అపహరించేందుకు దొంగలు ప్రయత్నించినట్లు నర్సాపూర్ ఎస్సై లింగం తెలిపారు. నర్సాపూర్ పట్టణానికి చెందిన మహేష్ తన ఇంటి ముందు శుక్రవారం రాత్రి రోజులాగే కారును పార్కు చేశాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారులో నుంచి మ్యూజిక్ సిస్టం ఏసీ పాయింట్ ఇతర వస్తువులు అపహరించేందుకు ప్రయత్నిస్తుండగా అలజడి కావడంతో మహేష్, అతని కుటుంబ సభ్యులు లేచి చూడగా దొంగలు పారిపోయినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

◆ 'రియల్' వ్యాపారుల ఆగడాలను అరికట్టాలి

జహీరాబాద్: రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా వెంచర్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం విమర్శించారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాయ నడుస్తోందని, వాగులు, వరద కాలువలను ఆక్రమించి వెంచర్లు వేసుకుంటున్నా నిర్మూలించే విషయంలో అధికారులు విఫలం అయ్యారన్నారు. వాగులు, నాలాలను మూసివేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయారన్నారు. అల్గోల్ రహదారిపై నాలాలను మూసివేసి వెంచర్ వేసినా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్‌ప్రభుగౌడ్, ఈశ్వరప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, విఠల్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ పరిశ్రమ సహకారంతో సీసీ రోడ్డు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో పరిశ్రమ సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శనివారం చేపట్టారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ చిత్తడిగా ఉండడంతో ఎస్ఐ మధుకర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు మండల పరిధి నవాబుపేట పరిధిలోని ఫ్లెమింగ్ ఫార్మా పరిశ్రమ యాజమాన్యం స్పందించి రోడ్డు పనులు చేపట్టింది. పరిశ్రమ ఎండీ ప్రకాశ్, డైరెక్టర్ రాంమోహన్, హెచ్ఆర్ మనోహర్‌కు పోలీసు సిబ్బంది, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

◆ రూ.లక్ష సాయం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటకు చెందిన రాజు కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఇటీవల మృతి చెందిన బాసం రాజు కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. రవి, నాగరాజు, కృష్ణ, వేణు, శ్రీను, సిద్ధిరాములు తదితరులు ఉన్నారు.

కేంద్రాన్ని ఒప్పించాలి

మీనాక్షికి 42 శాతం రిజర్వేషన్‌పై బీసీ సంఘాల వినతి

సంగారెడ్డి: రాష్ట్రంలో బీసీ జనాభా ఆధారంగా 42శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని బీసీ సంఘాల ప్రతినిధులు, జిల్లా విద్యార్థి అధ్యక్షుడు జగదీష్, యువత అధ్యక్షుడు లాడే బాలు తదితరులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను, ముఖ్యంగా ప్రతిపక్షాలను కలుపుకొని అఖిల పక్ష ప్రతినిధుల బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. బీసీ జనాభా గణాంకాలు, వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులపై సమాచారాన్ని సమగ్రంగా సమర్పించి కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు.



మీనాక్షిని కలిసిన బీసీ సంఘం నేతలు